డంపింగ్‌యార్డులో సర్వే

గుమ్మడిదల: ప్యారానగర్ డంపింగ్‌యార్డు ప్రాంతంలో సర్వే చేపట్టిన రెవెన్యూ అధికారులు

గుమ్మడిదల, మార్చి 6 : ప్యారానగర్ డంపింగ్‌యార్డు ప్రాంతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. గురువారం గుమ్మడిదల తహసీల్దార్ గంగాభవానీ, సర్వేయర్లతో సర్వే చేపట్టారు. రెవెన్యూ అధికారులు ఆభూములకు సంబంధించిన పూర్తి రికార్డుల ఆధారంగా సర్వే చేయాలని రైతులు కోరారు. రైతులకు రికార్డులు చూపించకపోవడంతో వారిఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. హైకోర్టు ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలుపగా, అక్కడి రైతులు ప్యారానగ ర్, అటవీప్రాంతం సరిహద్దును సర్వే చేయాలని భీష్మించారు. అయినప్పటికీ హైకో ర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్వహించామని తహసీల్దార్ గంగాభవానీ తెలిపారు.

విశ్రాంతి భవనం నుంచి కూలీల తరలింపు

బుదేరాలోని ప్రభుత్వ అతిథి గృహానికి తాళం వేసిన రెవెన్యూ అధికారులు

మునిపల్లి, మార్చి 6 : అతిథి గృహమా.. అద్దె భవనమా ? అనే శీర్షికన బుధవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించి గురువారం మండలంలోని బుదేరా చౌరస్తాలోని ప్రభుత్వ విశ్రాంతి భవనంలో ఉన్న పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన కూలీలను ఖాళీ చేయించారు. ఈ సందర్భంగా మునిపల్లి తహసీల్దార్ ఆశజ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంతి భవనంలోకి సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా ప్రవేశిం చే వారు ఎంతటి వారైనా చర్య లు తప్పవని హెచ్చరించారు. ప్ర భుత్వ విశ్రాంతి భవనంలోకి ఎవరు పడితే.. వారు ప్రవేశించకూడన్నారు. నేటి నుంచి బుదేరాలోని ప్రభుత్వ విశ్రాంతి భవనం మునిపల్లి రెవెన్యూ అధికారుల అధీనంలో ఉంటుందన్నారు. మునిపల్లి ఆర్ఐ సుభాశ్, మునిపల్లి ఆర్‌అండ్‌బి ఇన్‌చార్జి ఏఈ, తదితరులు ఉన్నారు.

వ్యాపారులు లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలి

అందోల్, మార్చి 6 : అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలో లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలని అధికారులు సూచించారు. రెన్యువల్ చేసుకొని వ్యాపారులకు నోటీసులు జారీచేసినట్లు మున్సిపల్ కమిషనర్ తిరుపతి గురువారం తెలిపారు. మున్సిపల్ సిబ్బంది, టాస్క్‌ఫోర్ టీమ్ తనిఖీలు నిర్వహించి పలు దుకాణాలకు నోటీసులు ఇచ్చారు. దీంతో బుధ, గురువారాల్లో రూ. లక్ష వరకు పన్నులు వసూలయ్యాయని తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే పూజలు



బ్రహ్మోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, మార్చి 6 : మండలంలోని బడంపేట రాచన్నస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హాజరయ్యారు. గురువారం ఆలయాన్ని సందర్శించి గర్భగుడిలోని శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో అన్నాదమ్ములు మృతి

జహీరాబాద్, మార్చి 6 :జహీరాబాద్ మండలంలో విద్యుత్ షాక్ తగిలి ఇద్దరు అన్నాదమ్ములు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. గోవిందపూర్ గ్రామానికి చెందిన ఎరుకుల మల్లేశం (48), ఎరుకుల జగన్ (42) ఇద్దరు కలిసి గురువారం రాత్రి పొలానికి వెళ్లారు. అడవి పందుల భారీ నుంచి పంటలను రక్షించేందుకు పొలం చుట్టూ వేసిన విద్యుత్ వైర్లకు తగిలి అక్కడి కక్కడే మృతిచెందారు. మృతదేహాలను జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. స్థానికుల ఫిర్యాదుతో జహీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రల్ జైలు ఆకస్మిక తనిఖీ

జైల్ స్టోర్ రూంలో నిత్యావసర సరుకులను పరిశీలిస్తున్న కార్యదర్శి రమేశ్

కంది, మార్చి 6 : కందిలోని సెంట్రల్ జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. కేసుల పరిష్కారానికి న్యాయవాదులు లేని వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థలకు అర్జీ పెట్టుకుంటే ఉచిత న్యాయ సేవలు పొందేందుకు న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలిపారు. జైల్ సూపరింటెండెంట్, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, మార్చి 6 : సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై నిర్వహించిన శిక్షణ తరగతులను యువత సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ మండలంలోని దిడ్గి గ్రామ శివారులోని డీడీఎస్-కేవీకే కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. రోజురోజుకూ వ్యవసాయంలో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను వినియోగించడంతో భూసారం కలుషితమైపోతున్నదన్నారు. తద్వారా పండే పంటల దాన్యాలను తినడం వల్ల అనేక రోగాల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సేం ద్రియ ఎరువులతో పంటలను పండించడం ద్వారా భూమిని కాపాడడమే కాకుం డా పండే ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఆనంతరం పలువురు శాస్త్రవేత్తలు.వర్మి కంపోస్టు, తేనె టీగల పెంపకం, శాస్త్రీయ పద్ధతిలో మేకలు, పశువుల పెంపకంతో కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. ఆనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ, యువకులకు సర్టిపికెట్లను అందజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రమే శ్, డాక్టర్ స్నేహలత, డాక్టర్ శైలజ, డాక్టర్ హేమలత, డాక్టర్ సాయిప్రియంక, డాక్టర్ కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నీటి సమస్యకు పరిష్కారం

సంగుపేట చెరువువద్ద జేసీబీతో కాల్వలను సరిచేసి నీటిని వదులుతున్న అధికారులు

అందోల్,మార్చి 6 : అల్మాయిపేట్-సంగుపేట గ్రామాల మధ్య ఏర్పడిన చెరువునీటి సమస్యకు అధికారులు పరిష్కరించారు. చెరువు నీటిని వ్యవసాయానికి అదించాలని గ్రామ రైతులు తహసీల్దార్ విష్ణుసాగర్‌కు వినతిపత్రం అందజేయగా, గురువారం రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు ఇరు గ్రామాల రైతులతో మాట్లాడారు. రైతులు నీటి విషయంలో గొడవలు పడొద్దని ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చూపుతుమన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సాగర్‌మధుకర్‌రెడ్డి, ఎస్సై పాండు, ఇరిగేషన్ అధికారులు, రైతులు ఉన్నారు.

డ్రైవింగ్‌తో ఉపాధి అవకాశాలు

రెండో విడత శిక్షణను ప్రారంభించిన కలెక్టర్

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, పాల్గొన్న మహిళలు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 6 : మహిళలు డ్రైవింగ్ నేర్చుకుంటే ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, ఉపాధిపొందవచ్చని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా ఆధ్వర్యంలో గురువారం మహిళలకు రెండో విడత డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో నగరానికి, హైటెక్ సిటీకి సంగారెడ్డి జిల్లా దగ్గరగా ఉన్నందున మహిళా డ్రైవర్లకు మంచి భవిష్యత్ ఉంటుందని భరోసా ఇచ్చారు. మహిళలు డ్రైవింగ్ శిక్షణలో నైపుణ్యం సాధించడం ద్వారా ప్రతి నెలా రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉన్నదన్నారు. మహిళా ప్రయాణికులకు కూడా భద్రత ఉం టుందన్నారు. మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబ ఆర్థిక అభివృద్ధిని సాధించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్డీవో జ్యోతి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అదనపు డీఆర్డీవోలు, డీపీఎంలు, మహిళా సం ఘాల సభ్యులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్

జహీరాబాద్, మార్చి 6 : నర్సరీలో చేపట్టిన మొక్కల పెంపకంపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని న్యాల్‌కల్ మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలో గ్రామ ప్రజలు, రైతులకు ఉపయోగపడే మొక్కలను ఎక్కువగా పెంచాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలు నీటితో బాగా క్యూరింగ్ చేయాలని సూచించారు. ఈజీఎస్ పథకం కింద కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా గ్రామాల్లో ఉపాధి హామీ పనులను కల్పించాలన్నారు. కూలీలు సంఖ్యను కూడా పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 8న మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఈజీఎస్ మండ ల ఏపీవో రంగారావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

హత్నూర, మార్చి 6 : హత్నూర మండలం నాగారంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మతల్లి దేవాలయానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి గురువారం రూ.1,01,116 ఆర్థికసాయం అందజేశారు. ఆలయకమిటీ సభ్యులు, నాయకులు ఉన్నారు.

కలుషిత జలాలపై నల్లా నీటి శాంపిల్స్ సేకరణ

మిషన్ భగీరథ అధికారులు సేకరించిన శాంపిల్స్

పటాన్‌చెరు, మార్చి 6 : ఇస్నాపూర్‌లో కలుషిత నీరు సరఫరా అవుతున్నదని 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంపై గురువారం అధికారులు తనిఖీ చేస్తున్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ కవిత ప్రధాన లైన్‌ద్వారా వస్తున్న నీటి శాంపిల్స్‌ను సేకరించారు. ఇందిరమ్మ కాలనీలో సరఫరా అవుతున్న నీటి నమూనాలు సైతం సేకరించారు. మిషన్ భగీరథ ద్వారా పంపిణీ అవుతున్న నీరు ఎక్కడ కలుషితం అవుతున్నాయి ? ఎంత మేరకు కలుషితమవుతున్నాయి.. అనే విషయంపై నీ టి నమూనాలు తీసుకున్నారు. ఈ నమూనాలు మిషన్ భగీరథ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

వైద్యులపై దాడి హేయమైన చర్య

ఎస్పీకి అందజేసిన ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న వెల్‌నెస్ దవాఖాన వైద్యులు

కంది, మార్చి 6 : సమాజానికి అత్యవసర సేవలందిస్తున్న వైద్యులపై దాడులకు పాల్పడటం సరికాదని సంగారెడ్డి వెల్‌నెస్ దవాఖాన యాజమాన్యం, వైద్య బృందం పేర్కొన్నది. ఈ నెల 1న మహిళను దవాఖానకు తీసుకొస్తే ప్రాణాలు కాపాడేందుకు తీవ్ర ప్రయత్నం చేశామని, పరిస్థితి విషమించి ఆ మహిళ మృతి చెందడం దురదృష్టకరమన్నారు. కానీ, ఈ విషయంలో దవాఖానను ధ్వంసం చేసి, వైద్యులు, సిబ్బందిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడికి పాల్పడి ఆస్తినష్టం చేయడంతో పాటు మృతురాలి కుటుంబానికి ఎలాంటి సంబంధం లేని కొన్ని గ్రూప్‌లు దవాఖానకు వచ్చి బెదిరింపులకు గురిచేస్తూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. గురువారం యాజమాన్యం ఎస్పీ రూపేశ్‌ను కలిసి దాడికి పాల్పడి డబ్బులు డిమాండ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సమావేశంలో వివరాలు వెల్లడించారు. వైద్యులు పునరావృతం కాకుండా చూడాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని ఎస్పీకి విన్నవించినట్లు వైద్యులు తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరికి రిమాండ్

అందోల్, మార్చి 6 : దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట ఎస్సై పాండు తెలిపారు. గురువారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన శివయ్యను ఇద్దరు వ్యక్తులు జోగిపేట మార్కెట్ యార్డు సమీపంలో బెదిరించి రూ. 13 వేలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, కర్ణాటకలోని బాల్కికి చెందిన శివకుమార్‌యాదవ్ (యాదవ్) జహీరాబాద్‌కు చెందిన ఆకాశ్ దొంగతనం చేసినట్లు తేలిందన్నారు. జోగిపేటలో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించడంతో సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. నేరం ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నాని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

అందోల్, మార్చి 6 : అక్రమంగా తరలిస్తున్న 510 బ్యాగుల (248క్వింటాళ్ల) రేషన్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేశామని జోగిపేట ఎస్సై పాండు తెలిపారు. గురువారం తమ సిబ్బందితో మండలంలోని సంగుపేట చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా లారీలో బియ్యం బస్తా లు లభించాయని తెలిపారు. కేసునమోదు చేసి బియ్యాన్ని సివిల్ సైప్లై గోదాంకు తరలించామన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

వట్‌పల్లి, మార్చి 6 : మండల పరిధిలోని పోతులబోగుడగలో ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సర ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ దివేన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 10వ తరగతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించబడుతుందని అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు విద్యార్థి అధార్‌కార్డు, ఫొటో, 5వ తరగతి బోనఫైడ్ అవసరమని, దరఖాస్తు రుసుము రూ.125 చెల్లించాలని సూచించారు.

వాయుకాలుష్యంతో ఉక్కిరి బిక్కిరి

పటాన్‌చెరు, మార్చి 6 : పాశమైలారం ఐడీఏలో అర్ధరాత్రి సమయంలో పరిశ్రమలు వదులుతున్న వాయుకాలుష్యంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. బుధవారం రాత్రి పాశమైలారం పారిశ్రామికవాడలోని పరిశ్రమలు సాయంత్రం 7 గంటల నుంచి వాయుకాలుష్యంను వదిలారు. రాత్రి 11గంటల వరకు ఈ వాయువులు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేశారు. ఈ విషవాయువులు ఇస్నాపూర్ చౌరస్తా, ఇందిరమ్మకాలనీ, ఇస్నాపూర్ గ్రామం, ముత్తంగి వైపుగా వ్యాపించాయి. రుద్రా రం, లక్డారం చౌరస్తాలోను ప్రభావం కనిపించింది. ఘాటైన వాసనలు, కళ్లలో నీరు రావడం, గొంతుమండటం జరుగుతున్నదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో వాయు కాలుష్యం ప్రభావం నిత్యం పెరుగుతున్నదని ప్రజలు మండిపడుతున్నారు. గ్రామాల్లో ఉండలేని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. రాత్రి వేళల్లో కాలుష్యం శుద్ధి చేసే యంత్రాలను నిలిపివేసి పరిశ్రమలు పొదుపు చర్యలకు పాల్పడుతుండటంతోనే వాయుకాలుష్యం వ్యాప్తి చెందుతున్నదని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. వాయుకాలుష్యంతో శ్వాస సంబంధిత సమస్యలు వస్తున్నాయని, వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాయుకాలుష్యాన్ని పీసీబీ అధికారులు అరికట్టలేకపోతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో టాస్క్‌ఫోర్స్ నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

నారాయణఖేడ్ పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద నూనతంగా నిర్మించిన శ్రీభక్త మార్కండేయ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారంతో ముగిశాయి. శ్రీగురు మదనానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీమాధవ నాంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో అర్చకులు గురురాజశర్మ సారథ్యంలో ఉత్సవాలు నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్, ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

-నారాయణఖేడ్, మార్చి 6

మహిళ లు అన్ని రంగాల్లో రాణించాలి

మాట్లాడుతున్న డిప్యూటీ లేబర్ ఆఫీసర్ నీరజ

సదాశివపేట, మార్చి 6 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డిప్యూటీ లేబర్ ఆఫీసర్ నీరజ అన్నారు. గురువారం భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మహిళలంతా ఏకమై తమ హక్కుల కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. అన్ని రంగాల్లో మహిళలు పురుషులకు ధీటుగా పని చేస్తున్నారన్నారు. రాబోయే కాలంలో మరింత చైతన్యవంతమై మహిళా రిజర్వేషన్లు సాధించాలన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద, శ్రామిక మహిళా కార్యదర్శి అనసూయ, బీకేఎంయూ మహిళా విభాగం అధ్యక్షురాలు బుజ్జమ్మ, రజిని, పూలమ్మ, యాదమ్మ, తస్లీమ్, బిపాషా, శంకరమ్మ, సత్యమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుమ్మడిదల, మార్చి 6 : మున్సిపాలిటీ కేంద్రంలోని ఎర్రచెరువులో గుర్తు తెలియన మృతదేహం లభ్యమైన ఘటన పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల కింద 50-55 వయస్సు గల వ్యక్తి చెరువులో స్నానం కోసం వెళ్లిండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈక్రమంలో ఆ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందాడు. గురువారం ఉదయం ఒడ్డుకు మృతదేహం రావడంతో అటుగా వెళ్తున్న గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోస్టుమార్టం నిమిత్తం దవఖానకు తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

హెచ్‌బీటీలకు వెంటనే జీతాలు చెల్లించాలి

రాయికోడ్, మార్చి 6 : ఆరు నెలల నుంచి తమకు వేతానాలు రావడం లేదని ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌బీటీలు స్థానిక ఎంఈవో అంజయ్యకు వినతి పత్రం అందజేశారు. గురువారం మండల కేంద్రమైన రాయికోడ్ ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తమకు ఆరు నెలల నుంచి వేతానాలు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో హెచ్‌బీటీలు శివశంకర్, మోహన్‌రాజ్, సుధాకర్, మమత, సౌమ్య, లక్ష్మి, బసమ్మ, సంధ్య ఉన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

తహసీల్దార్ సరస్వతీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సదాశివపేట, మార్చి 6 : రాష్ట్రంలో షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో పని చేస్తున్న కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26 ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట నిరసన తెలిపి అనంతరం ఎంఆర్‌వో సరస్వతీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికులకు జీతాలు పెంచుతున్నట్లు జీవోలు జారీ చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. సీఐటీయూ నాయకులు నీలం మల్లేశం, మోహన్, సీహెచ్ మన్నేశ్, లక్ష్మి, మొగులయ్య, రుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందోల్‌లో..

అందోల్, మార్చి 6 : కార్మికులకు కనీసం వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. జోగిపేటలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత

పుస్తెమెట్టెలు అందజేస్తున్న బీఆర్ఎస్ నేత అర్జున్

హత్నూర,మార్చి 6 : చింతల్‌చెరు గ్రామానికి చెందిన పేదింటి ఎర్రనోల్ల మల్లమ్మ-వీరయ్య దంపతుల కూతురు మానస వివాహం జరిగింది. గురువారం పెండ్లికి బీఆర్ఎస్ నాయకుడు అంబటి అర్జున్ పుస్తెమెట్టెలు అందజేశారు. ఆయన వెంట విష్ణుచారి, సాయినాథ్, మోసిన్ ఉన్నారు.

పచ్చని అడవులు అగ్నికి ఆహుతి

అడవిలో మంటలు వ్యాపించడంతో కాలిన చెట్లు

ఝరాసంగం, మార్చి 6 : అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఝరాసంగం మండల పరిధిలోని బర్దిపూర్, ఎల్గోయి ప్రాంతాల్లో గురువారం మంటల చెలరేగి హరితహారంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలతో పాటు పొదలు, మొక్కలు, చెట్లు కాలిపోయాయి. వేసవిలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పక్షులు, జంతు ప్రేమికులు కోరారు.

ఐటీఐ విద్యార్థులకు అప్రెంటిషిప్ మేళా

హత్నూర,మార్చి 6 : ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు హత్నూర ఆర్ఐటీఐ ప్రాంగణంలో ఈనెల10న మెగా అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఐటీఐ సంస్థ వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకొని జిరాక్స్ కాపీలతో పాటు బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

ఎర్పుల రాజు (ఫైల్)

జహీరాబాద్, మార్చి 6 : జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామానికి చెందిన ఎర్పుల రాజు అదృశ్యమైనట్లు జహీరాబాద్ పట్టణ ఎస్సై కాశీనాథ్ తెలిపారు. వివరాల ప్రకారం.. ఈ నెల 2న కూతురు ఇంట్లో ఉన్న ఎర్పుల రాజు సాయంత్రం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుం సభ్యులు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నెమలిని కాపాడిన రైతు

నెమలికి చికిత్స అందిస్తున్న గ్రామస్తులు

హత్నూర,మార్చి 6 : కోతులదాడిలో గాయపడిన జాతీయపక్షి నెమలిని ఓరైతు కాపాడి అటవీ సిబ్బందికి అందజేసిన సంఘటన హత్నూర మండలం దౌలాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చింత వీరేశం వ్యవసాయపొలంలో కోతులదాడిలో గాయపడి నడవలేనిస్థితిలో కిందపడి ఉండటాన్ని చూసిన వీరేశం వెంటనే పశువైద్య సిబ్బంది సంగమేశ్‌తో చికిత్స చేయించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బందికి అప్పగించారు.

పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

కంది, మార్చి 6 : కంది మండలం ఇంద్రకరణ్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్యూర్ వాటర్ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో రూ.2 లక్షల విలువ గల ఆర్‌వో ప్లాంట్‌ను మండల విద్యాధికారి జోగప్ప ప్రారంభించారు. విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సీడీఎఫ్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరాజయ్య, హెచ్ఎం ఠాకూర్ ఉదయ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

ఝరాసంగం, మార్చి 6 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కూలీ